# గోధుమ రంగు కల

1.

ఆమె తన గోధుమ రంగు పొదని అలమారా లో సర్దింది.. అది తన యవ్వనంలో అతనిని చూసినపుడు.. తన గదిలో ఇంద్రధనుస్సు రావడం చూసినప్పటి సంగతి... అమ్మ అది విని ... ఏడుస్తూ...అది మనలని వెంటాడుతున్న శాపం ... వంతెనలు లేని అమావాస్యని చూడడానికి నువ్వు సిద్ధంగా ఉండు..అలా అంటున్నప్పుడే ... అమ్మ కొన్ని వందల మీటర్ల లోతులోని లోయలో కనీ కనిపించకుండా ... కీచు గొంతుతో మాట్లాడుతుంది.

ముఖాన్ని తెచ్చుకోలేకపోతున్నానని ఏడ్చి ... రిషి ని ఇక మర్చిపోవలసిందేనని ఎవరికో మెసేజ్లో చెప్పింది.

నిజానికి అది ఎవరి నెంబరూ కాదు. ఉరిమినప్పుడు ... మెరిసినప్పుడు ... కెరటం విరిగినప్పుడు .. ఎవరో తెలియని ఖాళీ దీవుల్లోంచి వదిలితే ఎగురుకొంటూ చేరుతుంది.

నాకు అక్కడికి రావాలని ఉందని మొత్తుకున్నా ... రిప్లై రాదు... అడ్రస్ అంతకన్నా తెలియదు.

ఓ డేటా సెంటర్ కి వెళ్లి ... అతని చేతులని ... నా చేతుల్లోకి తీసుకొని... పెదాలని కొంచెం... తడుపుకొన్నప్పుడు .. నేను లొకేషన్ find out చేసి రేపిస్తానని నమ్మకంగా చెప్పాడు... ఒక కన్నుని వస్తూ... వస్తూ ... చిలకరించాను.

ఆ రాత్రంతా ... ఓ పెళ్లి కలని పడవలో ఎక్కించుకొని తిప్పుతూనే ఉన్నారు.. మర్నాడు మాసిన తెల్లవారు జాములో అక్కడికి వెళ్లబోతుంటే ... అక్కడంతా జనం ... అతను స్లీపింగ్ పిల్స్ మింగి ... మూసినా తన షాప్ మెట్ల దగ్గరే ఆత్మహత్య చేసుకున్నాడని.. అంత చీకటైపోయినట్లుగా ... అందరూ తన వేపు వస్తున్నట్లు.. నేరుగా స్టేషన్కి ... రైలు బొట్టుని పూసుకొని వారణాసి కి వెళ్ళడానికి సిద్ధమైంది.

అదే మెసేజ్ పెట్టినా .... ఎప్పటిలానే రిప్లై లేదు.

నెమలి తనని వెదుక్కొంటూ ఆఫీసులోకి వచ్చినపుడు ... అక్కడంతా ఓ వెదురు నిండిన అడవి. ఓ కన్ను మెరవని కౌగిలి... అదొక పాల జలపాతం కాఫీ మెషిన్ లోంచి... కాగితాలన్నీ తామరాకులుగా మారి ఫ్లోర్ అంత అడుగు ఎత్తు నీళ్లు..

ఫ్లోర్ మేనేజర్ పరుగున వచ్చి .. దయచేసి అందరూ వెళ్లి పొండి అన్నాడు.. ఆ వెదురులోంచి... హిందూళ రాగం నిండిన తన్మయ మహా నీలం. ఏడూ జన్మలని అవతలికి విసిరేసిన పచ్చితనం. ఎవరూ అక్కడనుంచి కదలలేక పోతున్నారు.. ఆ మేనేజర్ గుండె చప్పుడుని ఎవరో నాకేసారు.. కదలడం ఆగిపోయింది.

ఎవరూ నమ్మలేదు ...నేను తనతో కలిసి ఎగిరి ఎదురు అపార్ట్మెంట్ 11 వ అంతస్తులో ప్రియుడిని ముద్దు పెట్టుకొని అతని ఊపిరిని లాగేస్తానని... తీరా ... అక్కడికి చేరాక మిగిలినవి....

ఒక పల్చని తడి దుప్పటి... రెండు శంఖాలు .. నాచు నేసిన ఒక ముఖం.. కాఫీ కప్పులో చూపు బిగిసిన కన్ను....

అక్కడే ఏదో రహస్యం ఒబ్బిడిగా ఏడుస్తుంది. అది ఎవరిదో నాకు తెల్సు.. నాకు మాత్రమే తెల్సు....

డిజిటల్ ఎడారిలో చిక్కుకొన్న ఒంటె .. ఓ రంగుల కుండని మింగి నా ముందు నిలబడింది.. నన్ను అందరూ అసహ్యించుకోవడం మొదలైంది.. నాకేం సంబంధమని అరవాలని ఉంది.

................................

2.

తను గొడవ పడ్డ ఆ రాత్రి కడుపు జార్చుకుని... రెండో డాక్టర్ .. ఎందుకు ఇలా ... ముందే అన్ని సెటిల్ చేసుకొని...ఆ తర్వాత చూసుకోవచ్చుగా.. నేను మామిడిపళ్ళుగా మార్చేస్తున్న ... ఒక్క నీటి చుక్క ... కంటినుంచి వీటికి తగిలినా... ఇవన్నీ బిడ్డలై పోతాయి.

నిద్రని ముక్కలు చేసి ఆ స్విమ్మింగ్ పూల్ లో దాచాను. అతను దానితో కలిసి ఎప్పటికైనా నన్ను చంపడానికి నా కలలోకి వచ్చేస్తాడు. నాస్తికుడు .. ఆత్మని ఒప్పుకోడుగా అని ఎవరో ఆట పట్టిస్తున్నారు.

ధ్వనికి ముందే ప్రతిధ్వని పిల్చిన కవితో సంభాషణ మామూలుగా ఉండదు. పుప్పొడి కుండలో ఉడికే ఆత్మ మరో కొత్త దేహాన్ని పల్చని మంటపై ఉంచి .. సొమ్మసిల్లుతుంది.

మాటలు కాళ్ళని దాచుకోవు. కళ్ళలో కథ అలానే ఉంది.

దేవునితో సంభాషణ ముందే తెలిసిపోయినా ... ఇంకేం జరగదని పూజించేవాడే భరోసా ఇచ్చినా ... ఎందుకో వెదుకులాట..

ఇది తన కథ కాదని ఒప్పుకొన్న ... ఒప్పుకోకపోయినా .. ఫిక్స్ అయ్యిపోయారని.. రాత్రికి రాత్రి పడవని తయారుచేసుకొని నదిలోకి దించగానే ... నదిఎండిపోయింది.

పెద్దా .. చిన్నా అని లేదు.. ఏదైనా కథే కదా... ఒక మలుపు .. కొన్ని చావులు.. పెద్ద సంతర్పణ ... ఒపెళ్లి వేడుక .. అతడు పద్యాన్ని చదువుతూ ఉపన్యాసాన్ని మొదలు పెట్టడం. ఆశలు ..పెద్ద పెద్ద మర్రి చెట్లని మింగేసి ... చిటికెడు నీటిజాము లో పడి గిల...గిలా కొట్టుకొంటుంది.

ఇంకో ఈ-మెయిల్ తన ఊపిరిలోంచి తప్పుకు పోయిందని ... ఇదంతా వద్దు ... ఇరుక్కుంటావని మళ్ళీ పొగతో నిండిన మంచు వాకిలిలో స్మశాన దీపాన్ని వెలిగించి దారి చూపింది.

.........................

3

గజ్జెల మండపంలో పరిమళమిచ్చే గొడవని నాకోసం దాచిపెట్టింది. పెద్దగా రెప్పల బరువుని ఒప్పుకోలేదు. నది చుట్టూ నది... నది మధ్యలో నది....నది పక్కగా నది.. నేను ఏడవడం ... నాకు ఏడవాలని ఉండడం .. రెండూ ఒకటి కాదు. తను ఆ రోజు పెద్దగా ఏం మాట్లాడలేదు... అదే చివరిగా కలుసుకోవడమని తనకేగా తెల్సు... నేను మళ్ళీ రేపే కలుస్తాం కదా అన్నట్లుగా ఉన్నా..

నీతో నాకొచ్చిన కష్టమేం లేదు.. ఇప్పుడు నీ రూమ్ కొచ్చి రాత్రంతా ఉండమన్న నేను హాయిగా నిద్రపోగలను. కానీ అదే చాలా ? అంది.

నేను నవ్వి.. మానమొకసారి commit అయ్యి ... పెళ్లి జరిగాక సరిపోదు... అని మళ్ళీ నవ్వాను.

తానెందుకు బాధగా చూసింది.. బహుశా ముందే ఆ టెస్ట్ జరగాలని ఆమె కోరుకుందా ... ?

ఏదైనా conflict వస్తే ... అంది.

will resolve it ... ఇద్దరకీ జ్ఞానముంది... తృష్ణ ఉంది.. బలంగా నిలబడగలమనే నమ్మకముంది. ఇంకేం కావాలి? అన్నాను.

సరే ... నే వెళ్తా ... అంది.

నేను ముద్దు పెట్టుకోబోయాను.. ఆమె చెంప మీద కొట్టింది..నా తల కిందికి ఒరిగిపోయింది. But ,,, నేను కోలుకొని లేచేసరికి తను లేదు. మర్నాడే అమెరికా వెళ్లిపోయిందని మూడు రోజుల తర్వాత తెల్సింది. నా నుంచి ఏ కాంటాక్టుకి స్పందించలేదు... ఆ తర్వాత నా నంబర్ని బ్లాక్ చేసింది.

ఇలా ఎందుకు ... నువ్వేమైనా రీసన్ చెప్పగలవా ? అన్న ... ఎదురుగా ఉన్న లావణ్య తో..

ఈసారి నా రెండు చెంపలపై చేతులు పెట్టుకొని రుద్దుకొంటున్నాను. ఆమె కోపంగా చూడలేదు. నా చేతులని ఇష్టంగా లాక్కొని.. తన నడుముపై వేసుకొంది. కారులో కూర్చోబెట్టుకొని తన cottage కి తీసుకు వెళ్ళింది.

అక్కడ ముందు రూంలో పరాలీసిస్ తో మంచం పై పడున్న ( ఏళ్లుగా..) ఆమె భర్త .. నేను అతనిని

కౌగలించుకొని ఏడుస్తున్నాను. ఆమె అక్కడే నా పక్కాగా కూర్చొని తల నిమురుతుంది.. అతనేదో చెప్పాలనుకొని అల్లాడుతున్నాడు.

నాకు తెల్సి నీకింకా స్త్రీ లైఫ్ అర్ధం కాలేదనిపిస్తుంది.. అంది.

అతను ఓ పది రోజులకే చనిపోయాడు... కానీ ఆమె ఫోన్ చేసి ఈ విషయం చెబుతూ ... మరెప్పుడు తనని కలవడానికి ప్రయత్నం చేయొద్దు అంది.

గుడికి మార్చిన రెండో ముఖం దొరికిందని కొంచెం సిగ్గుతో దారి తప్పి ... ఊహించుకోవడానికిలేని కథ ని గడపలో వేలాడదీశారు. నాకు ఇంకేం వద్దు. కొత్తగా మరిన్ని ఉప నిద్రలు వాలనివ్వొద్దు. అంతా జరగిపోతుంది... నువ్వు మాటికీ నోరు తెరవొద్దు అంటారు. చీరలతో తడిచిన వాన ఇల్లు.. తల ఎగరేసిన ముద్దుల కుంపటి.. ఒరిగిపోయిన చీకటి పల్చగా నూనె రాసుకొంటూ .. ఎవరితోనో మాట్లాడుతుంది... ఇంకా కొంచెం అవకాశం లేదని .. నాలోకి నేనే స్పష్టమై.. ఘాడంగా ఊపిరి తీసుకొన్నాను. ఇదంతా కలిపితేనే నేను ...వారణాశి ఘాట్లు నాకదే చెబుతున్నాయా?

ఒక మహా నది మింగేసిన తొమ్మిది నెలల గర్భంలా నాకు నేనే కనిపించి మళ్ళీ పుట్టగలనా? ఇది ఆయుస్సు గురించిన తాపత్రయమని అనలేను..

కల నిండా పాములా చుట్టల మధ్యలోంచి నన్ను పిలుస్తున్న స్త్రీ మాత్రమే కనిపిస్తుంది. కొన్ని పుప్పిడి బిళ్ళలని మింగిన రాత్రి ... మంచుని మెత్తగా నాలోకి వదిలిపెడుతుంది.. ఇదే సరైన సమయం ఏం చేయడానికైనా... బిస్మిల్లాహ్ ఖాన్ సమాధి పక్కగా నేను .. సన్నాయి ని ఊదడం మొదలుపెట్టాను.

ఆమె టీ ని కాచి ... కప్పుల్లో పోసి ... ఆ కొండపై తాగుదామా అంది... కిందికి ఒక్కరమే తిరిగొస్తామని తెల్సినా ... సరే అన్నాను.. కానీ తన కప్పులని బోర్లించి నిద్ర పోయింది.

నేను మరి దేనికై ఆమెని నిద్ర లేపలేదు.

.........................................

4

మృత్యు విరాగం గురించి కథ చెప్పింది. నేను నీలా పాత్రని కాదు... నాకన్నీ చావుబతుకుల సమస్యలే ... ఊపిరి పాడుబడిందని భావిని తవ్వుతున్నారు. పుప్పొడికి కాపలానా ? అని నా కలలోకి వచ్చి అడిగింది. ఇంత బెంగని మోయడం కష్టంగా ఉంది.

ఎవరెందుకు పలకరిస్తారో ... ఎందుకు విడిచి పెడతారో నాకు అర్థం కాదు.

మంచు ముద్రాలని జల్లించి వాన గడపలో మూర్చబోయిన ఒక ఒంటరి గమకం లా నేను ఉండిపోవడాన్ని ఎవరూ ఎందుకూ ... అని కూడా అడగరు. నేను చనిపోవడం ... ఉండడం .. పరుగులు పెట్టడం ఏదీ ఎవరికీ పట్టదు.

మంచి జరిగేముందు ... ఇవన్నీ శకునాలు అంటూ... అంటూనే... అమ్మ ఏళ్ళు గడవనిచ్చి ... ఓ రోజు ... వదిలేసి వెళ్లి మట్టి దుప్పటి కప్పుకొని తిరిగి రానే లేదు. ఇంకెవరో వద్దని .. నా ఇంట్లో నేను కోపం తో అరిచినా ఎవరికీ పట్టదు. ఎవరో అర్ధ రాత్రి తలుపు కొట్టారు.. గుమ్మంలో ... ఓ పెద్ద పళ్లెం లో పెళ్లి భోజనం ... ఆ పక్కాగా కొంచెం దూరం లో నూనెతో వెలుగుతున్న మట్టి దీపం... చేతుల్లోకి తీసుకోగానే బోరున వాన ...

ఆ నీటిలో నా నగరం తప్పిపోయింది.. మాట పడిపోయింది.. ఇంకా కొంచెం తీరుబాటు లేని కొత్త గది నవ్వుకొంది. ఇలా నిద్రకి దొరకని సాక్షి మాట మారుస్తాడని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఇక మరి దేనికి దొరకని సంధి యుగం మనలని పిల్చి వడ్డిస్తుంది.

చేతుల్లోకి తీసుకోగానే బోరున వాన ..నాకు మాటా.. చూపు పడిపోయింది...

ఆమె తన కలలని మాత్రమే నా ముందు రోజూ తిప్పుతుంది.. శరీరం సగమైంది. శ్వాస గతి తప్పింది.. ఎవరో గవర్నమెంట్ హాస్పిటల్ వార్డ్ బయట వదిలేసి పోయారని మాత్రం కొంచెంగా తెలుస్తూ ఉంది.

రోజూ నిద్ర చావంత నిర్మలంగా ఉండాలి. రంగులు మరియు వెలిసిపోతున్న నాటకశాలల్లో కనపడని పాత్రలు... భయాల సంధాన కర్తకి తెలియని ఆందోళనని ముడిపెడుతున్నదెవరు?

కష్టపడి సమాధానం కనుకొన్న ...నానుంచి అడిగి తెల్సుకొనేదెవరు?

............................

5

తన దేహాన్ని ఎప్పుడు విప్పినా మురిసిపోతున్న కలలే అడ్డుపడతాయి .. దగ్గరవడానికి ... గాలి కేంద్రాల్లో నీటి తడబాటుని కిందికి లాగుతూ భయం కౌగలించుకొన్న మురిసిపాటు.. ఆ కాఫీ టేబుల్ ఇంకా ఖాళీగానే ఉంది ... డేటింగ్ app లన్ని .. రాత్రి కరెప్ట్ అయ్యాయని వాడు ఏడుస్తూ ... తను కనిపించడం లేదు... సోషల్ networks అన్నీఎమర్జెన్సీ సంధిలో ప్రకంపిస్తున్నాయి...

Global marketలో ఇదంతా కామన్ గా జరిగే క్రాష్ ... ఉండుండి .. కంగారుని ... దుఃఖాన్ని.. మరీ పైకి లేపుతుంది.. ఉనికిని మిగిల్చుకొని ఏం చేసుకొంటావ్? మరింత శ్రద్ధగా చనిపోయిన ఆయుస్సు ని గడప దాటించి వాళ్ళు ఆ పైకి చేరుకున్నా వసతులతో నవ్వుకొంటూ ... పగిలిన ఆశలతో ఆ మండపం లో కొందరు ఆశీస్సులని కలుపుతున్నారు.

ఇదంతా ... realization అంటూ యేమి కాదు... నాకేం బిడ్డ వద్దు.. నా వీసా ని ఎట్లా బ్లాక్ చేస్తారో నేనూ చూస్తా ... అరెస్ట్ చేస్తే ... అది నీ cottageలో నీతో గడిపిన రాత్రుల కంటే కఠినంగా ఉంటుందని నేననుకోవడం లేదు.

డిఎన్ఏ టెస్ట్ కి నేనెందుకు allow చెయ్యాలి?

తనకి ... నాకూ మధ్య ఏం లేదు... ఒకప్పటి ఫ్రెండ్ .. తనకి ఇంకెవరూ లేక ... నాకు రాసేసి ఉంటాడు... అదేమంత కోట్ల ప్రాపర్టీ కాదు.

ఐనా సరేనని ... నేను ఓపెన్ చేసేసరికి ... ఇంటి కింద పెద్ద భూకంపం ... ఇల్లు కూలిపోయింది... అర్జీని ఎవరూ చదవ లేదు.. అప్పుడొక పెద్ద రెక్కల మట్టి పక్షి .. గాల్లోకి లేచిందని నేను చెప్పిన ... ఎవరూ దానిని ఒప్పుకోలేదు... పట్టపగలు అటువంటి అబద్ధాలతో అలా ఎలా మోసం చేస్తావంటారు .. నిజమని తెల్సిన నువ్వు ఓ మాట సాయం చేయవని నాకు బాగా తెల్సు.

ఒక ఎండిపోయిన నది ... కాసేపు నా కాళ్ళ దగ్గర తన సమాధిని ఉంచి ... అంతలోనే నది నిండి ఉనికిని తీసుకు ( తనదని నేననుకొన్న ... కానీ అది నాది ) పోయింది. ఇప్పటికి ఆచూకీ లేదు ... నీతో ఈ రోజు ఈ గొడవ తర్వాత అలాగే జరుగుతుందన్న నమ్మకం వచ్చింది.

దేనికి రిగ్రెట్స్ ... ultimate గా ఇది మన mutual conclusion అనే నేననుకొంటున్న ...partial గా damage ఐయ్యింది నా దేహం.. నీ జిమ్ లు , protein షేక్ లు, ఇన్ టాక్సికాషన్ treatments ఏదీ వదల్లేదుగా ...

ఇది అప్పటికి పచ్చి ఆరని ప్రేమ .. గాలి ఒప్పుకొన్న దీర్ఘ వాకిలిలోని సంతర్ప దీపం.. ప్రార్ధించే సమాధుల మధ్య నేను తప్పిపోతానని తను నా కాళ్ళని తన దగ్గరే దాచుకొన్నాడు.. ఇప్పుడిక కొన్ని యుగాల వరకు నా కలలన్నీ తనవే..

............................

6

పోలికలు నా కొడుకనే అంటున్నాయి ... కానీ నేనూ ... వాళ్లు ఎవరూ ఒప్పుకోరు.. లక్షలు ఖర్చుపెట్టిన కృత్రిమ గర్భధారణలోంచి తీసాక ... ఎలా వదిలేసుకొంటారు..

ఇదిఏదో అనూహ్యం ... సరిపడని కంగారు ... ఇంకాస్త జాగ్రత్త ... మరింత తేలిక కానీ చీకటి నిద్ర కాదు... తానొక శిల్ప ముద్రతో నాలోపల చోటుని అడిగాడు...నేను ఏడ్చాను.. ఈ కూలిపోవడం అదీ తన ముందు... ఇలా ఎప్పుడూ అలవాటు లేదు. అదే ... నా conscious ఇలా ఎలా ఒప్పుకుందో నాకు తెలియదు. అదంతా ఓ అసంకల్పిత చర్యగా జరిగిందని నేను కంగారుగా అన్నాను .

స్టేషన్ వచ్చేసిందోమోనని నిద్ర మధ్యలో ముందే దిగిపోయిన ప్రయాణంగా తీసుకోలేవా?

ఆ తర్వాత నువ్వే ఫోన్ చేసాక... మరో trainలో నెక్స్ట్ day మార్నింగ్ బయలుదేరిపోయానుగా ...

ఆ ఒక్క సగం రాత్రిని accept చెయ్యలేవా ?

ఇప్పుడు ఈమె నా కూతురే అనడానికి ఇంకెవ్వరూ అడ్డురారు...

పైగా రాలేమంటారు. తను పెద్దయ్యాక ఇదేదో అపవాదుగా ఒప్పుకొంటుందా ? అయినా ఇది అపవాదు కాదుగా .. సత్యమే.. కానీ అదొక unexplainable exhaust టెర్మినల్ ని టచ్ చెయ్యడం ...

దేహంలో కొన్ని నిర్వచించలేనివి ఉంటాయని ... ఎవరు ఎలా అనుకొన్న ... జరిగే తీరుతాయని నేను ఒప్పుకోలేను. ప్రయత్న యజ్ఞంలోకి చేరిన మేఘ మండలం నిప్పై చెలరేగుతూ మరింత జ్ఞానవాహిగా కదిలే నిద్ర ద్రోహాల నిట్టూర్పులో .. కాసింత మృతువుని ఎదురు అడిగి తప్పిపోదామన్న వినదు.

గత చిత్రమై ఒరిగిపోయింది ఓ గుమ్మం .. కొన్ని ప్రతీక్ష మాయలు.. నిర్మగర్భ నిందలు .. ఏకాఏకి ఉండిపోయిన కొన్ని ప్రశ్నలు.. అలాంటి వాళ్ళు మొత్తం ప్రయాణానికి పనికిరానప్పుడు గొప్పగా చెప్పుకోవడం లో ఏం అర్థం ఉంది. కానీ ఇదంతా తనేం కోరుకోలేదు...

ఊరి బోర్డు చూసి నేనేగా ఫోన్ చేసి స్టేషన్కి రమ్మంది.

ప్రయత్న యజ్ఞంలోకి చేరిన మేఘ మండలం నిప్పై చెలరేగుతూ మరింత జ్ఞానవాహిగా కదిలే నిద్ర ద్రోహాల నిట్టుర్పులో .. కాసింత మృతువుని ఎదురు అడిగి తప్పిపోదామన్న వినదు. అతను పై బెర్త్లో కి ఎక్కి నిద్రపోయావా ? అని అడిగితే .. ఇంకేం చేస్తాను... ( కొంచెం ఆగి ) నిష్ఠూరంగా ఊ అని ... స్టేషన్ పేరుని తలచుకొంటూ ఎదురు చూసిందెవరు?

ఈ సమర్థించుకోవాలనే తాపత్రయం నాకు మాత్రమే ఎందుకు ? మర్యాదల సొసైటీ లో నా పేరుని రిజిస్టర్ చేసుకోవాలనేగా ... అతనేంటి అలా .. మహా సముద్రం లోకి నది వెళ్లి కలవాలంటే కలవాలి... తను మాత్రం అక్కడే ఉంటాడు. నిత్యమూ కెరటాలతో ఎగిరెగిరి పడుతూ...

కానీ ఆ గొంతులోని పాట ... ఎవరిని నిలదీయదు. పరుగు పెట్టదు.. స్పృహ ని మిగల్చదు... సర్వం బూడిదయినా ఓ నిర్వాణ స్థితి.. మన సమాధి పై మనమే ఓ పుష్పగుచ్చం ఉంచుకోవడం ... అంతకంటే నిర్మల స్థితి లేనప్పుడు ... అదే మన చేరాల్సిన చివరి స్టేషన్ అయినప్పుడు ... ఎందుకు అక్కడనుంచి పరుగుతో వెనక్కి వచ్చెయ్యడం.

తనెక్కడ ఉన్నాడా? తంబూరని శృతించుకుంటూ ఆ వారణాశి లో ఎటు తప్పిపోయాడో..

ఏదీ కాకతాళీయం కానప్పుడు ... మరెవరో దీనిని డిజైన్ చేసి వదిలారుకుంటే.. ఆ సమాధానమూ అప్పుడే దొరుకుతుందేమో..

తానెప్పుడూ .. ఎవరో తనని తడుముతున్నారని... తలుపులన్నీ బిగించిన ... AC గాలిలోంచి వచ్చి ... దూరంగా కాఫీ షాప్ లో ఉన్నా ID కార్డుని ప్రూఫ్ గా ఒప్పుకోమంటారు.

అక్కడొక ప్లాస్టర్ అఫ్ పారిస్ తో చేసిన బొమ్మ పడి ఉంది.. అలా అంటే ... తుపాకిని నా నుదుటికి గురి పెట్టింది. నేనదే మొదటిసారి ... నిజమైన తుపాకిని చూడడం ... అదో రకమైన గంధకపు వాసన...

చూసి ఇచ్చేస్తానంటే .. చేతిలో పెట్టింది.. నాకు బుల్లెట్ వద్దని తన గుండె లో దాచుకోమని ఇచ్చాను.. ఆమె ని ఇప్పటికి పెట్టిలోనే పడుకోబెట్టాను. రోజూ ఓ కప్పు కాఫీ అందులో పోస్తున్నాను.. మెసేజ్ లన్ని అక్కడికే చేరుతున్నాయని తెల్సినా.. నేనలా ఎవరికీ తొందరపడి చెప్పను.

...................................

ఆ రోడ్ల కూడలిలో నిత్యమూ ఎవరో ఒకరు దిగుతున్నట్లే ఉంటుంది.. అది తను కాదని తెల్సిన.. కాలింగ్ బెల్ మోగిందంటే చూపు అటే... ఇలా రెండు దశాబ్దాలు ... ఇదంతా బావుందా?

శరీరం లో దాచి పెట్టుకున్న విరళ రహస్యం ఏదైనా ఉండే అంటే అది ఇదేకదా ... ఇప్పటికి ఆ స్టేషన్ రాత్రి తడుముతూనే అతని సంసారం..

దేహంలోకి కలగా వచ్చి ... తానే కలై.. స్నానం చేసిన ఆత్మల మలిన నీరు నాకిచ్చి ... పారబొయ్యమంటే ... ఇంకా ఎందుకు గంగాజలంలా మొయ్యడం.. ఎవరికీ ఏమని చెప్పాలి..

మళ్ళీ కనిపించలేదా అంటే .. కనిపిస్తూనే ఉన్నాడు. ఎవరెవరో యూట్యూబేలో ... ఫేస్బుక్ , ట్విట్టర్లో షేర్ చేస్తూనే ఉంటారు ... అతని పాటలని... అవి ఒక దేశమో ... ఒక భాషో .. ఒక ఎమోషనో కానే కాదు

ఎన్ని భాష లు వచ్చు అంటే... లెక్క తెలియదు అంటాడు... పాటకి ముందు ... వెనక ఏ ప్రిపరేషన్ ఉండదంటాడు... ఎంత పెద్ద స్టేజి అయినా తన లోపల ఆ క్షణం లో ఏమీ పలుకక పోతే అలానే వెనక్కి వెళ్ళిపోతాడు.

ప్రపంచ యాత్ర అన్ని రకాలుగానూ చేస్తూ ఉంటాడు... ఒక్కోసారి నెలల నెలలు.. తప్పిపోతాడు..

ఓసారి ఎవరో trekking group అతని పాట కోసం చెబుతూ ... ఆగకుండా డాన్స్ చేస్తూనే ... ఆయన ఒంటి మీద అదే పల్చని లాల్చీ .. పైజామా ... అంతెత్తు హిమాలయాల్లో కనిపించి .. పాటని వినిపించి ... తెల్లారేసరికి మళ్ళీ కనిపించలేదని... వాళ్ళకి అర్థమైనట్లుగా ... ఓంకారం తానే ఐన ధ్యాన మహర్షి అన్నారు.

మరో సారి కాశ్మీర్ బోర్డర్లో.. ఓ ఇంటర్వ్యూ లో బిస్మిల్లాహ్ ఖాన్ కోసం పాడుతూ ... వారణాశి ... నాకు నా శాశ్వత స్మశానం అన్నాడు.. అవిశ్రాంత మరణ ఘోష పిలుపుని నాకు సంగీతం వినిపించిన రోజున నేనెక్కడికి చేరుకొంటానని నాకు తెలుసు ... అంటాడు.

ఎవరో సన్నాయి చేతికిస్తే ... అతని వేళ్ళ మధ్య అంతే సరళ ద్యుతి

అనుమానాలన్నీ చెదిరిపోవాలి.. ధర్మో రక్షిత రక్షితః ... అదొక క్లైంపాస్ భాగోతం ... అలా ఏమి ఉండదు. కదిలిపోతున్న ఇల్లు అంతిమ సత్యం.. ఖననం జరగాలనేం లేదు.. పెద్ద గడసరి నవ్వుని కూల్చడానికి సాధన కావాలి. అది కొత్తగా మరొక తెలియని సత్యంలో ముసుగేసుకుని తప్పిపోయిన దేహాన్ని ల్యాబ్ లో తయారుచేస్తానంటుంది... శరీరం లో దాచి పెట్టుకున్న విరళ రహస్యం ఏదైనా ఉండే అంటే అది ఇదేకదా ... ఇప్పటికి ఆ స్టేషన్ రాత్రి తడుముతూనే అతని సంసారం..

అప్పుడు ఆ స్టేషన్లలోంచి అతని పక్కగా తడుస్తూ విన్న రాగ మోహన విస్మయ చీకటి .. నాలోపల పండుతూ .. ఎందుకు ఆ గోడల మధ్యకి ... నది పక్కాగా ఈ చెట్లు కట్టుకున్న ఇల్లు చాలదా ? అన్నప్పుడు ...

నేను నువ్వెవరు ? అని అడిగాను...

ఈ ప్రపంచానికి చెందని బికారిని ... అన్నాడు...

నా చిటికెన వేలిని కూడా అతను తాకకుండానే .. పాటగా నా లోపల మరో దేహంగా నిండిపోయాడు..

అప్పుడు అన్నాడు.. దేహం శత కోటి తంత్రుల సమాహారం ... విశ్వ మీమాంశల సమాధానాలన్నీ ఇక్కడనుంచి మనకి దొరుకుతాయి.

ఆ తర్వాత ఏం జరిగిందో ఇప్పటికి నాకు తెలియదు.. ఒక వేళా ఏదైనా జరిగి ఉంటే ... అంతకు మించిన పరమ సత్యపు నివాసం ఈ దేహానికి ఏం ఉంటుంది... నాకీ రోజుకి బిక్ష సరిపోయిందని ... చిన్న నోట్ నా అరచేతిలో రాసి ... నేను నిద్రలో ఉన్నప్పుడే ... వెళ్ళిపోయాడు..

ఎవరినో అడిగితే .. ఆ ఊరిలోని అతనింటికి తీసుకు వెళ్లారు... తలుపులన్నీ తీసే ఉన్నాయి...

ఆయన వారణాశి వెళ్ళారుగా ... మీ నెంబర్ ఇవ్వండి... ఆయన వచ్చినప్పుడు చెబుతాం.

అయన తప్పకుండ మీకు ఫోన్ చేస్తారని...

వారణాశి నుంచి కొంచెం మట్టి... పొగ... బూడిద .. కొన్ని కలలని తవ్విన గోళ్లు కావాలంది.. ఇదంతా ఎలా ... రైలు బండి తనకి వద్దని పడవలో కాపురం పెట్టుకొని వెళదామని...

కొన్ని తాత్కాలిక సత్యాలపై మనం చేసే నిత్య ప్రయాణం లో మళ్ళెప్పుడో తారసపడ్డప్పుడు .. నా ఉనికి విశ్వమంతా నిండిపోతుంది ... అని .. రోజూ నాతో ఉండే అతనితో ఈ మాట అన్నప్పుడు.. అతని గుండె మోయలేక ... ఆగిపోయింది .

గోపురాలపై చనిపోయిన సన్నాయి రంగులు ... కొంచెం విశ్రాంతి కావాలని సిగ్గుపడ్డ మసక చీరల అడివి... నును సిగ్గు కాల్చుకున్న శవాలన్నీ గుడి ముందు మొక్కులు తీర్చుకొనే టైం లో చేరాం.

అద్దంలో ఇంకేవో క్రియా సైగలు.. తడి బొమ్మల కలవరం కుమ్మరించిన పడకలు..సన్నాయి చనిపోయిన ఇల్లు... రావి చెట్టు కింద దొరికిన తల.....మరిన్ని తలపోతలు....

చితా భస్మం తీసుకొని అదే వారణాశి కి... అతనికై చూస్తూ... ఆ పాటని ఈ కలశంలో నింపాలని ..రోజూ నా చేతుల్లోనే ఐనా ఇంకా ఆ కలశ నిమజ్జనం ఇంకా చెయ్యలేదు.

ఎప్పుడు తిరిగొస్తావని ఎవరూ అడగనూ లేదు.

...........................